

రంజాన్ వేళలు శనివారం(ఇఫ్తార్-6:35), ఆదివారం (సహెర్-4:57)

నిలువ నీడ కరువు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వేసవిలో పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు వేయాల్సి ఉంది. తాగునీటి సౌకర్యం కల్పించాలి. ప్రమాదాలు జరిగితే ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. కానీ అవేవీ కల్పించడం లేదు. అమరచింత మండలం పామిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల భీమా కాల్వలో ఉపాధి హామీ పథకం కింద పూడిక, జమ్ము తొలగిస్తున్నారు. ఇక్కడ నీడ సౌకర్యం కల్పించకపోవడంతో కూలీలు ఎండలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీ నాగన్న ఎడమ కాలిపై ప్రమాదవశాత్తు గడ్డపార పడింది. అక్కడ ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లేకపోవడంతో అతన్ని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అమరచింతకు తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేయించారు. ప్రభుత్వం కూలీ రూ.207 నిర్ణయించగా.. అధికారులు కొలతల పద్ధతిన అమలు చేస్తున్నారని, దాంతో ఒక్కరికి రూ.100 నుంచి రూ.150 మాత్రమే పడుతుందని కూలీలు వాపోతున్నారు. వేసవి అలవెన్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని, వేసవి అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

- అమరచింత





అమరచింత మండలం పామిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల భీమా కాల్వలో పనులు చేస్తున్న కూలీలు



నీడ కోసం టెంట్లు వేయకపోవడంతో ఎండలోనే సేద తీరుతున్న కూలీలు




ఆత్మకూరు మండలం మోట్లంపల్లి గ్రామంలో ఎండలో నిలబడిన కూలీలు



ఉపాధి పనుల్లో గాయపడి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీ

అభివృద్ధి అంటే ఏంటో చూపుతాం

» మార్నింగ్ వాకర్స్‌తో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



మార్నింగ్ వాకర్స్ మద్దతు కోరుతున్న కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 22: 'పాలమూరు భవిష్యత్తు కోసం.. మన భవిష్యత్తు కోసం పార్లమెంట్ ఎన్నికల్లో మేధావులు, విద్యావంతులు ఆలోచించి విజ్ఞతతో ఓటు వేయాలి. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా.' అని ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బాలుర జూనియర్ కళాశాల, స్టేడియం మైదానంలో మార్నింగ్ వాకర్స్‌తో పాటు వాక్ చేశారు. ఈ సందర్భంగా వారి మద్దతు కోరారు. దేశం మొత్తం రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటుందని, భారత్ జోడో యాత్రలో ఈ విషయం స్పష్టమైందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని చెప్పారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే పాలమూరును అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలు రాష్ట్రంలో ఎంతో నమ్మకంతో కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు నెలల్లోనే ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఐదింటిని అమలు చేసి ప్రజల మన్ననలను పొందుతున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఇతర పార్టీలకు ఓటు వేస్తే మహబూబ్‌నగర్ అభివృద్ధిపై ప్రభావం పడుతుందన్నారు. జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నందున మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆయన ఇన్‌చార్జిగా ఉన్న ఈ పార్లమెంట్‌లో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో వంశీచంద్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ క్రీడాకారులతో కలిసి బ్యాడ్మింటన్ ఆడారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేశ్, బెక్కరి మధు, సీపీ బెనహర్, సిరాజ్‌ఖాద్రి, సాయిబాబ, లక్ష్మణ్ యాదవ్, ఫయాజ్, అజ్మత్‌అలీ, ఏర్పుల నాగరాజు పాల్గొన్నారు.

నేను లోకల్

» ఓట్లడిగే హక్కు నాకే ఉంది
» బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్ నగర్ (క్లాక్ టవర్), మార్చి 22: 'నేను లోకల్. ఈ ప్రాంత బిడ్డను. ఓటు అడిగే హక్కు నాకు మాత్రమే ఉంది.' అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాళికాంబ కల్యాణ మండపంలో, పద్మావతి కాలనీలో ప్రశ్నిస్తున్న మహిళా శక్తి అనే కార్యక్రమాన్ని మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను పక్కా లోకల్ అని చెప్పారు. ఇప్పుడు పోటీలో ఉన్న పార్లమెంట్ అభ్యర్థులు కేవలం ఓట్ల కోసమే వచ్చారని, వారెవరికీ పాలమూరుతో పేగుబంధం లేదన్నారు. పాలమూరులో ఓట్లడిగే హక్కు తనకు మాత్రమే ఉందన్నారు. గతంలో ఎంపీగా గెలిచినోళ్లు ఎవ్వరూ ఇక్కడ లేరని, జిల్లాలో ఎలాంటి అభివృద్ధి కూడా జరగలేదని అన్నారు. పాలమూరు ప్రజల కోసం నిరాహార దీక్షలు చేసింది తానని, ఆర్డీఎస్ తూముల మూసివేతపై రాయలసీమ రైతులతో పోరాటం చేసిందీ తానేనని చెప్పారు. మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నింట్లో మనం సగ భాగమని, మీరు తలుచుకుంటే పాలమూరు ఎంపీ అభ్యర్థిగా తన గెలుపును ఎవరూ ఆపలేరని అన్నారు. ఉచితాల పేరుతో మహిళలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, 100 రోజులు గడిచినా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఇప్పుడేమో 17 ఎంపీ సీట్లు గెలిస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామనడం మోసం కాదా? అని ప్రశ్నించారు. ఇలాంటి కాంగ్రెస్ నాటకాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు. ఫ్రీ బస్సు పథకం అమలు చేయాలని ఎవరడిగారని ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. 500లకు గ్యాస్ ఇవ్వలేదని, గ్యాస్ ధరలో 60 శాతం కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందన్నారు. మోదీ మాటంటే మటేనని, మాట ఇచ్చాడంటే అది అమలయ్యే వరకు నిదరపోడని కొనియడారు. సూర్యఘర్ స్కీం కింద కేంద్రం 300 యునిట్ల వరకు ఇవ్వబోతుందన్నారు. దేశం బాగుండాలంటే మరోసారి మోదీ ప్రధాని కావలసిన అవసరం ఉందన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై నిలదీయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజా రెడ్డి, జయశ్రీ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మవేణీ, కార్యదర్శి సాహితీ రెడ్డి, మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

రెఢీ

» నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి పోటాపోటీ
» కాంగ్రెస్ నుంచి ముగ్గురు పోటీపడగా మల్లు రవికి ఛాన్స్
» బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ పోటీ
» భరత్ ప్రసాద్‌కు టికెట్‌తో బీజేపీలో అంతర్గత విభేదాలు



నాగర్‌కర్నూల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి పోటీకి అభ్యర్థులు ఖరారు కావడంతో ఇక ప్రచారం వేడెక్కనుంది. కాంగ్రెస్ నుంచి మల్లు రవి, బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ నుంచి ప్రస్తుత ఎంపీ తనయుడు భరత్‌ప్రసాద్ బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో పాటు మందా జగన్నాథ్ కూడా టికెట్ కోసం ప్రయత్నించగా.. చివరికి ఆ అదృష్టం మల్లు రవిని వరించింది.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీతో మారనున్న సమీకరణలు?

బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు చెప్పుకోదగిన బలం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆ విషయం నిరూపితమైంది. అయితే బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పోటీ చేయడం, బహుజన సమాజ్ పార్టీ నుంచి ఆయనకున్న బలగం కారణంగా పార్లమెంట్ ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది.

కమలంలో తలోదారి

బీజేపీ నుంచి ఎంపీ రాములు తనయుడు భరత్‌ప్రసాద్‌ను ఎంపిక చేయడంతో ఆ పార్టీలో అంతర్గత విబేధాలు చోటు చేసుకున్నాయి. నాగర్‌కర్నూల్‌లో ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన సభ విజయవంతమైనప్పటికీ నాయకుల్లో సమన్వయ లోపం కారణంగా దెబ్బతిన్నామని ఆ పార్టీ నాయకులే అంతర్గతంగా విశ్లేషించుకుంటున్నారు. సమష్టిగా కృషి చేసి ఉంటే మోదీ సభకు కనీసం 50 వేల మంది హాజరయ్యేవారని, స్వచ్ఛందంగా తరలి వచ్చిన వారికి కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో జనంలో పలుచన అయ్యామనే భావన పార్టీ ప్రధాన నాయకుల్లో వ్యక్తమవుతుంది. బీజేపీలో పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా మారింది. జనంలో పరపతి ఉన్నా.. దాన్ని ఉపయోగించుకోలేకపోయామని ఆ పార్టీ ప్రధాన నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పేరు: మల్లు రవి



పుట్టిన తేదీ: 14-07-1950
చదువు: ఎంబీబీఎస్, డీఎల్‌వో
భార్యా పిల్లలు: రాజబన్సిదేవి, కుమార్తె అనంత శృతి మల్లు, కుమారుడు సిద్ధార్థ మల్లు
స్వస్థలం: లక్ష్మీపురం, ఖమ్మం జిల్లా
రాజకీయ అనుభవం:1991, 1998లో రెండుసార్లు నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా గెలుపొందారు. 2008 శాసన సభ ఉప ఎన్నికల్లో జడ్చర్ల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004-2008 వరకు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పని చేశారు.

పేరు: ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్



పుట్టిన తేదీ: 23-11-1967
స్వస్థలం: అలంపూర్
తల్లిదండ్రులు: సవారన్న, ప్రేమమ్మ
విద్యార్హత: ఎంఏ(పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్), హార్వర్డ్ యూనివర్సిటీ, యూఎస్ఏ
వృత్తి :విశ్రాంత ఐపీఎస్ అధికారి(1995 బ్యాచ్ ఐఏఎస్ అధికారి). ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పని చేశారు.
రాజకీయ అనుభవం: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. గత శాసన సభ ఎన్నికల్లో సిర్పూర్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

పేరు: పోతుగంటి భరత్‌ప్రసాద్



పుట్టిన తేదీ: 07-08-1987
స్వస్థలం: గుండూరు గ్రామం, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా
తల్లిదండ్రులు:పోతుగంటి భాగ్యలక్ష్మీ, పోతుగంటి రాములు
విద్యార్హతలు: ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఎంటెక్
రాజకీయ అనుభవం: కల్వకుర్తి జడ్పీటీసీ.(రాష్ట్ర జడ్పీటీసీల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి)

540 కిలోల బెల్లం పట్టివేత

» 100 కిలోల నవసాగరం కూడా.. » ఎక్సైజ్, ఎస్టీఎఫ్‌ల దాడులు



బెల్లం, నవసాగరం, వాటిని తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్న జడ్చర్ల ఎక్సైజ్, ఎస్టీఎఫ్ అధికారులు

జడ్చర్ల, మార్చి 22 : జడ్చర్ల ఎక్సైజ్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేసి, అక్రమంగా తరలిస్తున్న 540 కిలోల బెల్లం, 100 కిలోల నవసాగరాన్ని పట్టుకున్నారు. వివరాలను జడ్చర్ల ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ విప్లవరెడ్డి వివరించారు. మిడ్జిల్ మండలంలోని పెద్దగుండ్ల తండాలో సారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఈ నెల 21న దాడులు చేశారు. ముడావత్ బుజ్జమ్మ వద్ద వద్ద రెండు లీటర్ల సారా పట్టుబడింది. సారా తయారీకి ముడి సరుకులను ఎక్కడి నుంచి తెస్తున్నారని విచారించగా తన కుమారుడు ముడావత్ సుమన్ హైదరాబాద్ నుంచి తెస్తాడని బుజ్జమ్మ తెలిపింది. శుక్రవారం హైదరాబాద్ నుంచి మిడ్జిల్ మండలానికి బెల్లం, నవసాగరం తెస్తున్నట్లు బుజ్జమ్మ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్‌లోని మలక్‌పేటలో గల నల్గొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కారులో తరలిస్తున్న బెల్లం, నవసాగరాన్ని పట్టుకున్నారు. 30 కిలోలతో 18 బస్తాల్లో బెల్లం, 50 కిలోలతో రెండు బస్తాల్లో నవసాగరం ఉండగా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 540 కిలోల బెల్లం, 100 కిలోల నవసాగరం విలువ రూ.36 వేలు ఉంటుంది. ముడావత్ బుజ్జమ్మ, ముడావత్ సుమన్‌లను అరెస్ట్ చేశారు. దాడుల్లో జడ్చర్ల ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్, ఎస్టీఎఫ్ ఎస్ఐ బాలరాజులు పాల్గొన్నారు.

కారు ఢీకొని చిన్నారి మృతి



ప్రమాదానికి కారణమైన కారు

రాజేంద్రనగర్, మార్చి22 (ఆంధ్ర జ్యోతి) : అజాగ్రత్తగా కారు నడిపిన ఓ వ్యక్తి ఎనిమిది మాసాల పసిపాప మరణానికి కారకుడు య్యారు. ఒక్కగానొక్క కుమార్తె మరణించడంతో ఆ బాలిక తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటన రాజేంద్రనగర్ సర్కిల్‌లోని అక్బర్ హిల్స్ సుల్తాన్ ప్యాలెస్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రీను, వసుంధర దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి వచ్చారు. రాజేంద్రనగర్‌లోని అక్బర్‌హిల్స్ ప్రాంతంలో గల సుల్తాన్ ప్యాలెస్‌లో ఉంటున్నారు. వసుంధర వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా, ఆమె భర్త శ్రీను మేస్త్రీగా పని చేస్తున్నాడు. వారికి ఎనిమిది నెలల వయస్సు గల బాలిక రుక్మిణి ఉంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో రుక్మిణి పార్కింగ్ స్థలంలోని వాకర్‌లో ఆడుకుంటోంది. అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఆయాజ్ అహ్మద్ తన కారును అజాగ్రత్తగా నడుపుతూ ఆడుకుంటున్న రుక్మిణిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బాలిక తలకు బలమైన గాయాలయ్యాయి. తల్లిదండ్రులు బాలికను హైదర్‌గూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలిక మరణించిందని వైద్యులు తెలిపారు. దీంతో వారు బోరున విలపించారు. ఈ ఘటనపై వసుంధర అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని, అయాజ్ అహ్మద్‌పై కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా

కోస్గి రూరల్, మార్చి 22 : నారాయణపేట జిల్లా కోస్గి పోలీసులు ఓ దొంగల ముఠాను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. శుక్రవారం ఆరుగంటల పాటు ఎనిమిది మందిని పోలీసులు విచారించారు. రెండురోజుల క్రితం పట్టణంలో పట్టపగలు తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేస్తు ఓ దొంగ పట్టుబడటంతో అతడిని కాలనీవాసులు పోలీసులకు అప్పగించారు. విచారణ మొదలుపెట్టిన పోలీసులు ఎనిమిది మంది బృందం ఉన్నట్లు తెలుసుకొని అందరినీ అదుపులోకి తీసుకున్నారు. వీరంతా కొంత కాలంగా వివిధ ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నారు. వీరంతా వివిధ కేసుల్లో జైలులో పరిచయమై బృందంగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పలు ప్రాంతాల్లో వీరంతా మేకల దొంగతనాలు, ఇళ్లల్లో చోరీలు చేసినట్లు తెలిసింది. ప్రధానంగా తాళం వేసిన ఇళ్లల్లో, రాత్రిపూట మేకల షెడ్లల్లో వీరు చోరీలకు పాల్పడుతుంటారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు శనివారం రిమాండ్‌కు పంపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలు తొలగించాల్సిందే

» ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రాజ్
» సిర్సనగండ్లలో అక్రమ నిర్మాణాల పరిశీలన



ఇళ్ల అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎండోమెంట్ అధికారులు, ఆలయ చైర్మన్

చారకొండ, మార్చి 22 : రెండో అపర భద్రాద్రిగా పేరుగాంచిన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను తొలగించాల్సిందేనని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం దేవాలయ చైర్మన్ ఢేరం రామశర్మతో కలిసి ఎండోమెంట్ అధికారులు దేవాలయ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రాజ్ మాట్లాడుతూ దేవాలయ భూముల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మించిన 34 ఇళ్లు, దుకాణాలను తొలగించేందుకు వచ్చిన అధికారులను ఇళ్ల బాధితులు తమకు రెండు నెలల వరకు సమయం ఇవ్వాలని అధికారులను కోరారు. ఏప్రిల్ 30 వరకు ఇళ్లను ఖాళీ చేయాలని, లేకపోతే తామే తొలగిస్తామని ఎండోమెంట్ అధికారులు బాధితులకు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జీతాల కోసం ఎదురుచూపు

» ఆరు నెలలుగా వేతనాలు రాని లష్కర్‌లు



ఖిల్లాఘణపురం బాలికల ఉన్నత పాఠశాల పది పరీక్షా కేంద్రం వద్ద కాపలాగా ఉన్న లష్కర్‌లు

ఖిల్లాఘణపురం, మార్చి 22: సాగునీటి పారుదల శాఖలో పని చేస్తున్న చిరుద్యోగులు లష్కర్(నీరేటికాడు)లు జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాకు చెందిన వీఆర్ఏలను రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణిస్తూ వనపర్తి జిల్లాకు కేటాయించారు. పదో తరగతి చదివిన వారిని లష్కర్‌లుగా నియమించారు. 2023 ఆగస్టు నుంచి వారు విధులు నిర్వహిస్తున్నారు. ఉద్దగిరి బాలయ్య తలారి శంకరయ్య, మెరుగు నరసింహ, బుగ్గ రాములు, సంగం రాజు ఖిల్లాఘణపురం మండలంలో, మరో ఆరు మంది పెబ్బేరు మండలంలో పని చేస్తున్నారు. కాల్వల్లోని చెట్లను, ముళ్ల పొదలను నిరంతరం తొలగిస్తున్నారు.

భారంగా మారిన కుటుంబ పోషణ

సొంత గ్రామాల్లో వీఆర్ఏలుగా పని చేసినప్పుడు నెలకు రూ.10,500 వేతనంతో కుటుంబాన్ని పోషించిన వారు రెగ్యులర్ ఉద్యోగులుగా నియామకం అయ్యాక జీతాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. నేటికీ ఐడీ కార్డులు రాలేదని, ఎనిమిది నెలలుగా పని చేస్తున్నా రెండు నెలల జీతమే ఇచ్చారని అంటున్నారు. అద్దె ఇళ్లలో ఉండటంతో ప్రతీ నెల రూ.15 వేలు ఖర్చవుతున్నాయని, అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి చూయించుకోడానికి డబ్బులు ఉండటం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు కొట్టడానికి వెళ్లి, గాయపడ్డా ఆస్పత్రి ఖర్చులకు నోచుకోవడం లేదని అంటున్నారు. ప్రస్తుతం వారు పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను తనిఖీ చేయడానికి విధులు వేశారు. సాగునీటి పారుదల శాఖలో అవసరానికి మించి ఉద్యోగులు అధికంగా ఉన్నారని.. అందుకే జీతాలు, బిల్లులు చేయడంలో ఇబ్బందులు ఉన్నాయని అధికారులు అంటున్నారని వాపోతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ నరేందర్ రెడ్డిని వివరణ లష్కర్‌లకు త్వరలోనే జీతాలు చెల్లించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా దుర్వాసరాజు ఎంపిక

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 22 : తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ప్రముఖ కళాకారుడు వరకవుల దుర్వాసరాజు రెండో సారి ఎన్నికయ్యారు. కేవీ రమణాచారి గౌరవ సలహాదారుగా, వ్యవస్థాపక అధ్యక్షుడిగా తడకమళ్ల రాంచంద్రరావు వ్యవహరించే తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా దుర్వాసరాజుతో పాటు, సలహాదారులుగా సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, రాష్ట్ర కార్యవర్గంలో పాలమూరు జిల్లాకు చెందిన కళాకారులు వి.నారాయణ, మాలెల అంజిలయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా టి.కృష్ణకు సహాయ కార్యదర్శిగా చోటు దక్కింది.


దుర్వాసరాజు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

» పట్టిపోతున్న బోరుబావులు » ఎండిపోతున్న వరి పైర్లు » ఆందోళనలో అన్నదాతలు



దేవునితిర్మలాపూర్ గ్రామ శివారులో ఎండుముఖం పడుతున్న వరి

పెద్దకొత్తపల్లి, మార్చి 22 : ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో రబీలో సాగు చేసిన వరి పైర్లు ఎండుముఖం పడుతున్నాయి. రోజురోజుకు ఎండలు విపరీతంగా పెరుగుతుండడంతో బోరుబావుల్లో నీటి మట్టం తగ్గుతూ పోతోంది. పోతుంది. పెద్దకొత్తపల్లి మండలంలో కొందరు రైతులు బోరుబావులపై, మరి కొందరు రైతులు ఎంజీకేఎల్ఐ నీటిపై ఆధారపడి వరి పంటలను సాగు చేశారు. పంట పూర్తిగా చేతికొచ్చే వరకు కాల్వల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. ఒకవైపు ఎంజీకేఎల్ఐ కాల్వల ద్వారా నీటి సరఫరా నిలిచిపోగా, మరోవైపు బోరుబావుల్లో నీటిమట్టం పడిపోవడంతో వరి సాగు చేసిన రైతులు పంటలపై ఆశలు వదులుకున్నారు. మండలంలోని పెద్దకొత్తపల్లి, దేవునితిర్మలాపూర్, నక్కలపల్లి, చంద్రకల్, ఆదిరాల, పెద్దకార్పాముల, సాతాపూర్, జొన్నలబొగుడ, కల్వకోల్, గంట్రావుపల్లి, చిన్నకార్పాముల తదితర గ్రామాల్లో 7,359 ఎకరాల్లో వరి పంటను, 7,488 ఎకరాల్లో వేరుశనగ, 3,300 ఎకరాల్లో మినుములు, 444 ఎకరాల్లో మొక్కజొన్న, 20 ఎకరాల్లో ఉల్వ పంటను సాగు చేశారు. బోరుబావులు సహకరిస్తాయని.. కాల్వల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని ఎంతో ఆశతో వరి పైరును సాగు చేశారు. కాల్వల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడం, భూగర్భజలాలు అడుగంటిపోతుండడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో వేసిన పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. వేలాది రూపాయలతో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోతుండడం, మరోపక్క తెగుళ్ల తీవ్రత కారణంగా పంటలను ఎలా రక్షించుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతున్నారు. తెగుళ్ల బారిన పడి నీరు లేక ఎండిపోయి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





పెద్దకొత్తపల్లి-దేవునితిర్మలాపూర్ గ్రామాల మధ్య నీరు లేక వట్టిపోయిన ఎంజీకేఎల్ఐ కాల్వ, వట్టిపోయిన బోరుబావి

పెట్టుబడి రాని పరిస్థితి



రెండెకరాల్లో వరి పంటను సాగు చేశా. ఎకరా సాగు కోసం రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టాను. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పంటను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నాను. ఫలితం లేదు. పెట్టుబడి రాని పరిస్థితి దాపురించింది.

- బొల్లె పెద్ద నిరంజన్, దేవునితిర్మలాపూర్

మద్యం పట్టివేత

తెలకపల్లి/ఉప్పునుంతల, మార్చి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బి.రాజు అనే వ్యక్తి తెలకపల్లి నుంచి అక్రమంగా 28 క్వార్టర్ల లిక్కర్ బాటిళ్లు, ఆరు బీరు సీసాలను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు. అదేవిధంగా, ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల గ్రామానికి చెందిన రెంటింతల చంద్రశేఖర్ శుక్రవారం వెల్టూరు గేటు వద్ద ఉన్న వైన్ నుంచి గ్రామానికి మద్యం తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు

ఏ గ్రేడ్‌గా న్యాక్ గుర్తింపు

జడ్చర్ల, మార్చి 22 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్‌గా న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు దక్కింది. గత సంవత్సరం కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం నివేదికల ఆధారంగా కళాశాలకు బి ప్లస్ ప్లస్ గ్రేడ్‌గా న్యాక్ గుర్తింపు ఇచ్చింది. కాగా కళాశాలకు సరైన గుర్తింపు రాలేదని, మరోసారి సందర్శించాలన్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, అలూమ్ని సభ్యుల విజ్ఞప్తి మేరకు గతనెల 21, 22వ తేదీల్లో న్యాక్ బృందం సందర్శించింది. న్యాక్ బృందం నివేదికల ఆధారంగా ఈనెల 21న జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకే ఏ గ్రేడ్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గుర్తింపు ఐదేళ్ల పాటు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు కలిగిన ఏకైక కళాశాలగా గుర్తింపు దక్కిందంటూ శుక్రవారం కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, అలూమ్ని కళాశాల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, అలూమ్ని అధ్యక్ష, కార్యదర్శులు పాలాది రామోహన్, బాదిమి రవిశంకర్‌లు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు.



న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు రావడంతో సంబురాలు జరుపుకుంటున్న అధ్యాపకులు, విద్యార్థులు

మంచి ఫలితం సాధించినందుకు సంతోషంగా ఉంది

- అప్పియచిన్నమ్మ, ప్రిన్సిపాల్

కళాశాలకు 3.24 స్కోర్‌తో ఏ గ్రేడ్ సాధించడం సంతోషంగా ఉంది. రాష్ట్రంలో న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన పది కళాశాలల్లో జడ్చర్ల కళాశాల ఉండడం ఎంతో గర్వంగా ఉంది.

కందూరు రామలింగేశ్వరాలయంలో

ఘనంగా శివపార్వతుల కల్యాణం

అడ్డాకుల, మార్చి 22 : మహబూబ్‌నగర్ జిల్లాకు తలమానికంగా వెలుగొందుతున్న అడ్డాకుల మండలం కందూరులో వెలసిన శైవ క్షేత్రం కందూరు రామలింగేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం టీటీడీ శైవాగమ వేద పండితుడు పుల్లేటికుర్తి గణపతిశర్మ, ప్రధాన పూజారి మణికంఠ శివాచార్య, ఆయన శిష్యబృందం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా తయారుచేసిన వేదికలో శివపార్వతుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందూరు గ్రామం నుంచి తలంబ్రాలను పల్లకీలో ఊరేగింపుగా బాజా భజంత్రీలతో తీసుకువచ్చారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గణపతిపూజ, కన్యాదానం క్రతువులతో కల్యాణం జరిపించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరై పట్టు వస్త్రాలను సమర్పించారు. అదేవిధంగా మొదటిసారి ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అయిదు జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో మహిళలు, స్థానిక నాయకులు, ఈవో రాజేశ్వరశర్మ, అకౌంటెంట్ అనంతశర్మ, సాయిబాబా, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత

రాజీనామాలకు ఆమోదం

» చైర్మన్, వైస్ చైర్మన్ రాజీనామాలకు ఆమోదం తెలిపిన కలెక్టర్
» ఈనెల 19న తమ పదవులకు రాజీనామా చేసిన గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్
» కొత్త సభ్యుల ఎన్నికల ఎప్పుడన్నదే అందరిలో నెలకొన్న ప్రశ్న



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

వనపర్తి టౌన్, మార్చి 22 : వనపర్తి మునిసిపాలిటీలో ముదిరిన అవిశ్వాసానికి పూర్తిగా ఫుల్‌స్టాప్ పడింది. చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలన్న అసమ్మతి కౌన్సిలర్లు తమ పంతం నెగ్గించుకున్నారు. అవిశ్వాస సమావేశం కంటే ముందుగా తమ పదవులకు రాజీనామా చేసి గౌరవం దక్కించుకోవాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చేసిన సూచనలతో ఈనెల 19న తమ పదవులకు వ్యక్తిగత కారణాలు చూపుతూ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ రాజీనామాలు చేశారు. రాజీనామా లేఖలను కమిషనర్ పూర్ణచందర్ ఈనెల 20వ తేదీ ఉదయమే కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు అందించారు. మునిసిపల్ నిబంధనల ప్రకారం రాజీనామా లేఖలకు కలెక్టర్ శుక్రవారం ఆమోద ముద్ర వేశారు. దీంతో గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్‌లకు తమ పదవులతో బంధం శుక్రవారం నాటితో తీరి పోయింది.

అయోమయానికి స్టాప్

తమ పదవులకు రాజీనామా చేసిన చైర్మన్, వైస్ చైర్మన్లు తిరిగి మూడు రోజుల్లోగా ఎక్కడ మనసు మార్చుకుంటారోనన్న అసమ్మతి కౌన్సిలర్ల సందేహానికి స్టాప్ పడింది. మునిసిపల్ యాక్ట్ ప్రకారం రాజీనామాలు చేసిన మూడు రోజుల్లోగా తిరిగి మనసు మార్చుకుంటే రాజీనామా లేఖలను వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుంది కాబట్టి, ఎక్కడైనా అవకతవకలు జరిగితే ఏంటనే సందేహం పలువురి అసమ్మతి కౌన్సిలర్లలో నెలకొంది. దీంతో వేరే ఇతర కారణాలు చూపుతూ ముగ్గురు కౌన్సిలర్లు ఎమ్మెల్సీ క్యాంపునకు వెళ్లకుండా వనపర్తిలోనే ఉండిపోయారు. శుక్రవారం కలెక్టర్ ఆమోదం తెలపడంతో అసమ్మతి నేతల్లోనూ నెలకొన్న చిక్కుముడి పూర్తిగా వీడింది. ఇక కొత్తగా పదవిని వరించబోయేది ఎవరన్న దానిపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా అసమ్మతిగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ కౌన్సిలర్లలో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం బీఆర్ఎస్ పార్టీ సభ్యులే చైర్మన్, వైస్ చైర్మన్‌గా కొనసాగాలని అనుకున్నారు. కానీ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో కొందరు వైస్ చైర్మన్ పదవిని కోరుదామని చర్చించుకున్నారు. దీనిని విభేదించిన మిగతా కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ సభ్యులు పూర్తిగా తిరస్కరించినట్లు విశ్వసనీయ సమాచారం.

జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు

గోల్‌కీపర్‌గా జడ్చర్ల విద్యార్థి

జడ్చర్ల, మార్చి 22 : జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు గోల్‌కీపర్‌గా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామానికి చెందిన క్రీడాకారుడు శివకుమార్ ఎంపికయ్యాడు. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని విదిషలో జరిగే జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున శివకుమార్ గోల్‌కీపర్‌గా ఆడనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు బాలాత్రిపురసుందరి, కార్యదర్శి శంకర్‌నాయక్‌లు శుక్రవారం తెలిపారు. ఇటీవల జరిగిన అంతర్‌రాష్ట్ర హ్యాండ్‌బాల్ ఛాంపియన్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు గోల్‌కీపర్‌గా ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు.



గోల్‌కీపర్‌గా ఎంపికైన శివకుమార్

వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డి, తదితరులు

బిజినేపల్లి, మార్చి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం అడ్డుగట్టుపై వెలసిన మంగా గోదా సమేత వేంకటేశ్వరస్వామి 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అలంకరణ, రాజభోగ నివేదన, శాత్తుమొఱై, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డి, ఆలయ వ్యవస్థాపక సభ్యుడు సందడి ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో కూచకుళ్ల శ్రీనివాస్‌రెడ్డి, అనంత అశోక్‌రెడ్డి, కొర్ర చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రావొద్దు

» మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి



రుద్రారం గ్రామంలో డబుల్ ఇళ్లకు నీటి సరఫరా అమలు వివరాలు తెలుసుకుంటున్న మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి

నవాబ్‌పేట, మార్చి 22 : వేసవిలో గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రారం, కాకర్లపాడ్, కేశవరావుపల్లి తదితర గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు, నీటి సరఫరా, బోరింగ్‌లు, బోరుబావులను డీఈ వెంకటరమణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో భద్రునాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ పుల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు తాగునీటిపై కార్యదర్శులతో మాట్లాడి తమకు నివేదికలు అందజేయాలని, అనుబంధ గ్రామాల్లో అవసరమైన చోట బోరుబావులు లీజుకు తీసుకోవాలని కోరారు. అయితే, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షమీఉల్లా గ్రామాలకు సరిగ్గా రాడని ఆయన పనితీరు పట్ల వివిధ గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వరని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈఈ వెంట వివిధ గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

» ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 22 : ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని నాగనూలు శివారులో సాయంత్రం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన ఆటో ప్రయాణికులతో నాగర్‌కర్నూల్‌కు వస్తున్న క్రమంలో నాగనూలు శివారులో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో పెద్దాపూర్ గ్రామానికి చెందిన అనసూయమ్మ(46) అక్కడికక్కడే మృతి చెందగా, చంద్రమ్మ, రాంబాబు, నిరంజన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులకు ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

వెల్దండ, మార్చి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం గుండాల గ్రామ సమీపంలో ఈనెల 16న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై ఎం.రవి తెలిపిన వివరాల ప్రకారం.. చారకొండ మండలం సార్లబండతండాకు చెందిన ఇస్లావత్ సంగ్‌డా(47) హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ఈనెల 16న స్వగ్రామమైన సార్లబండతండాలో ఓ శుభకార్యానికి హాజరై తనకు సోదరుడైన రమేష్‌కు చెందిన ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గుండాల గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో సంగ్‌డా తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి హైదరాబాద్ ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు భగవాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడు అదృశ్యం, కేసు నమోదు

ఉప్పునుంతల, మార్చి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అలూరు గెలువయ్య కుమారుడు అలూరు శ్రీకృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మొబైల్ ఇంటి వద్దనే ఉంచి వెళ్లడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ తెలియరాకపోవడంతో పోలీసులను సంప్రదించాడు. గెలువయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జడ్చర్లలో మహిళ..

జడ్చర్ల : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న మహిళ కన్పించడం లేదంటూ ఆమె అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. కల్లుతాగే అలవాటు ఉన్న మహిళ ఈనెల 20న సాయంత్రం కల్లు తాగేందుకు ఇంటి పక్కన వారికి చెప్పి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తెలకపల్లి/జడ్చర్ల, మార్చి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం దుందుభి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మండలంలోని గౌరారం గేటు సమీపంలో వాహనాలను పట్టుకొని గ్రామానికి చెందిన గోవిందు, శివ, సాయికుమార్, మహేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. అదేవిధంగా, నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటికి చెందిన మరో రెండు ఇసుక ట్రాక్టర్లను తెలకపల్లి శ్మశానవాటిక సమీపంలో పట్టుకొని డ్రైవర్లు మహేష్, లక్ష్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం ఇసుక ట్రాక్టర్ సిగ్నల్‌గడ్డ వైపు వెళ్తుండగా కానిస్టేబుల్ ఆపి విచారణ చేపట్టాడు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

కాకర్లపాడులో టిప్పర్..

నవాబ్‌పేట : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపాడు గ్రామంలో ఇసుక టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని టీడీ గుట్టకు చెందిన మహేష్ ఓ టిప్పర్‌లో ఇసుకను నింపుకొని గురువారం అర్ధరాత్రి నవాబ్‌పేట నుంచి మహబూబ్‌నగర్ వైపు వస్తుండగా కాకర్లపాడ్ గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వాహనాన్ని ఆపి విచారించారు. ఇసుకకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ మహేష్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

కల్వకుర్తి : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై బి.మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో నాగర్‌కర్నూల్ రోడ్డు వైపు నుంచి అనుమతి లేకుండా వస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో గుర్తించామన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి తిరుమలనాథ స్వామి జాతర

- ఐదు రోజుల పాటు ఉత్సవాలు - జాతర పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే యెన్నం


తిరుమలనాథస్వామి జాతర పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

హన్వాడ, మార్చి 22 : మండలంలోని మాదారం-యారోనిపల్లి గుట్టపై వెలిసిన రాకమ కొండ తిరుమలనాథస్వామి జాతర శనివారం నుంచి ప్రారంభం కానున్నది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిని దర్శించుకునేందుకు జిల్లాతో ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. కొన్నేళ్లుగా జాతరకు భక్తుల సంఖ్య పెరిగింది. వేసవి సీజన్ దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 23 నుంచి 27 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. 23న స్వామి విగ్రహాన్ని మాదారం నుంచి దేవాలయానికి చేరుస్తారు. 24న అభిషేకం, అలంకరణ, హనుమత్ సేవ, 25న కల్యాణోత్సవం, రాత్రి రథోత్సవం, 26న తీర్థోత్సవం, జాతర, గరుడ సేవ, 27 పల్లకి సేవ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా తిరుమలనాథ స్వామి జాతర పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కేంద్రంలో తన క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గొల్లూరి వెంకటరమణాచారి, శేషాచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, వెంకటయ్య, నర్సిములు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాలు

హన్వాడ, మార్చి 22 : మండలంలోని గుడిమల్కాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి రేణుకా ఎల్లమ్మదేవతకు బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దేవాలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు నైవేద్యం సమర్పించి, గ్రామస్థులను అందరినీ చల్లంగా చూడాలని వేడుకున్నారు. మూడు రోజుల పాటు బోనాల పండుగను జరుగనుంది.

అగ్రిమెంట్ రెన్యూవల్స్‌పై ఎమ్మెల్యేకు వినతి

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్), మార్చి 22 : పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలోని జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకు భవన సముదాయంలోని దుకాణాలలో అద్దె కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కిరాయిదారులు (వ్యాపారులు) ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. పలువురు దుకాణదారులు శుక్రవారం ఎమ్మెలను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 25 ఏళ్ల నుంచి లీజ్ (కిరాయి)కి తీసుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని కిరాయిదారు లు పేర్కొన్నారు. ఇదివరకు నాలుగైదేళ్లకోసారి దుకాణాల అగ్రిమెంట్లు చేసుకునేవాళ్లమని, 2014 నుంచి ఈ ప్రక్రియ జరగడంలేదని ఎమ్మె ల్యేకు వివరించారు. దుకాణాల అగ్రిమెంట్‌లను రెన్యూవల్ చేయాలని పలుమార్లు కో-ఆప రేటివ్ బ్యాంక్ అధికారులను కోరుతూ దరఖాస్తులు పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ బ్యాంక్ అధికారులు స్పందించడం లేదని తెలిపారు. నాలుగు నెలల క్రితం వరకు అద్దెకూడా చెల్లించామన్నారు. ఆ తర్వాత అద్దెను తీసుకోవడం లేదని వారు తెలిపారు. దుకాణాలను ఖాళీ చేయిస్తే మా కుటుంబాలతో పాటు వర్కర్సు కూడా (సుమారు 500 మందిమి) రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జోక్యం చేసుకొని కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులతో మాట్లాడి దుకాణాల రెన్యూవల్స్‌ను కొనసాగించే విధంగా చూడాలని వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌కు సన్మానం


కొత్వాల్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 22 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన ఒబేదుల్లా కొత్వాల్‌ను శుక్రవారం రైల్వే స్టేషన్ మజీద్ ఆవరణలో పలువురు మైనార్టీ సోదరులు సన్మానించారు. మౌలానా ఖతీబ్ గులాం, మహమ్మద్ సాహెబ్, మజీద్ కమిటీ అధ్యక్షుడు సత్తార్ సాహెబ్, సలీం అడ్వకేట్, అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా, కార్యదర్శి మహ్మద్ యాకుబ్, అహ్మద్, షేక్ మహ మూద్, అసద్, ముబిన్, సోఫీ, మజ్జిద్ ఇమామ్ మాజాన్‌అహ్మద్ పాల్గొన్నారు.

విడతల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం

- వార్డుల్లో పర్యటించిన మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్


బస్తీ దవాఖానాలో మందులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్, మార్చి 22 : పాలమూరు పురపాలిక పరిధిలోని కాలనీలలో నెలకొన్న అన్ని సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామని మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన 5వ వార్డు, 2వ వార్డు ఏనుగొండలోని పలు కాలనీలలో పర్య టించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు నీసీరోడ్లు, డ్రైనేజీ లేకపోవడం వల్ల నీరు ఇళ్ల మధ్య నిలిచిపో తోందని తెలిపారు. అదేవిధంగా ఏనుగొండలోని బస్తీ దవాఖానాను పరిశీలించి అక్కడ మందులు, సిబ్బంది కావాల్సినంత ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి అంటే ప్రధాన రోడ్లపై కూడళ్లను అభివృద్ధి చేసి వీధులను పట్టించుకోలేదని అన్నారు. అందువల్లే ఎక్కడికెళ్లినా సమస్యలు దర్శనమిస్తు న్నాయని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షబ్బీర్, నాయకులు వెంకటేశ్, పురుషోత్తం, కిరణ్, రమేశ్ పాల్గొన్నారు.

వర్గీకరణపై కేంద్రం నిర్లక్ష్య వైఖరిని వీడాలి

- ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు మేడిపాపయ్య

పాలమూరు, మార్చి 22 : కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్య వైఖరి వీడాలని ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా పాపయ్య మాట్లాడారు. మాదిగ యువత రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని, ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యానికి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మాదిగ యువత మత్తు పానీయాలకు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎర్రగుంట నరేశ్, రావుల కృష్ణ, యాదయ్య, సి.హెచ్ రాజు, శ్రీను, కె.బాలకృష్ణ, రంగయ్య, హనుమంతు, వీరేశ్, దస్తయ్య, వెంకటయ్య, బొక్కి రాములు, గంగయ్య, మురళి, రఘు, శ్రీను, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయంలోనే ఏర్పాట్లు పూర్తి కావాలి

- పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ రవి నాయక్


పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై వెబెక్స్ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 22 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు నిర్దేశిత సమయంలోనే పూర్తి ఏర్పాట్లు చేయాలని పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. వెబెక్స్ ద్వారా శుక్రవారం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏఆర్వోలు, జిల్లా నోడల్ అధికారులు, తహసీల్దార్లతో పార్లమెంట్ ఎన్నికల కోసం కేటాయించిన పనులపై సమీక్షించారు. మహబూబ్‌నగర్ జిల్లా నోడల్ అధికారులు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇతర జిల్లాల నోడల్ అధికారులతో సమన్వయంతో ఎన్నికల పనులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ఈ నెల 26న నిర్వహించేందుకు డేటా బేస్ సిద్ధం చేసుకొని తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ నోడల్ అధికారి అవసరమైన వాహనాలు సిద్ధం చేయాలని అన్నారు. పోలీస్ నోడల్ అధికారి ఇతర జిల్లాల అధికారులతో అవసరమైన అనుమతులు జారీకి సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ప్రతీ రోజు పర్యవేక్షించాలని, పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. హోం ఓటింగ్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి 85 సంవత్సరాలు దాటినవారికి, పీడబ్ల్యూడీ ఓటర్లకు ఫామ్ 12-డి పంపిణీ చేయాలని అన్నారు. ఎన్నికల ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏఆర్వోలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు భయపడి ఖాతాలు సీజ్

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మ దహనం


ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్, మార్చి 22 : కాంగ్రెస్‌కు భయపడి కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా ఏఐసీసీ బ్యాంక్ ఖాతాలను సీజ్ చేయించిందని యువజన కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ యువజన కాంగ్రెస్ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్ని ఎత్తులు వేసినా, ఎన్ని కుట్రలు పన్నినా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. బీజేపీ ప్రజావ్యతిరేక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ఆ పార్టీకి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్, ఎండీ సల్మాన్, అనిల్‌కుమార్‌రెడ్డి, శంశోద్దీన్, నరేశ్‌బాబు, కిషన్‌నాయక్, చిన్న, నాగరాజు, బండి మల్లేష్, ఖాదర్, రఘు, ముక్రం, బాలు, అక్రమ్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ కోసం స్థలం పరిశీలించిన డీఈవో


అడ్డాకులలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో రవీందర్

అడ్డాకుల, మార్చి 22 : పది సంవత్సరాల క్రితం అడ్డాకుల ఎంపీడీవో కార్యాలయం సమీపంలో మోడల్ స్కూల్ కోసం సర్వేనెంబరు 530, 531, 532లో దాదాపు 3 ఎకరాలను స్థానిక మాజీ ఎంపీపీ అనితాదేవి దంపతులు దానం ఇచ్చిన భూమి కోర్టు వివాదాల్లో చిక్కుకోవడంతో శుక్రవారం మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్ స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు పరిశీలించారు. అప్పట్లో మోడల్ స్కూల్ కోసం డీఈవో పేరిట దాన పూర్వకంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన భూమిలో విద్యాశాఖ అధికారులు ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. ధరణిలోనూ కొంతభూమి ఇంకా పట్టాదారుల పేరుమీదనే ఉండడం, భూమి విలువలు పెరగడంతో అనితాదేవి కటుంబసభ్యులు తాము దాన పూర్వకంగా ఇచ్చిన భూమిని ప్రభుత్వం వాడుకోలేదని, భూమిని తమకు స్వాధీనం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దాంతో మోడల్‌స్కూల్ స్థలం వివాదాస్పదంగా మారడంతో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాన్ని చదును చేయించాలని డీఈవో ఎంపీడీవోకు సూచించారు. ప్రభుత్వ అవసరాలకు వాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాసులు, సీఎంవో బాలుయాదవ్, తహసీల్దార్, ఎంఈవో నాగయ్య, ప్లానింగ్ కోఆర్డినేటర్ గోవర్ధన్, హెచ్‌ఎం ఉమాపతి, పీఈటీ అంజయ్య పాల్గొన్నారు.

కుమ్మరిజాతి మూల విరాట్ శాలివాహన చక్రవర్తి

- శాలివాహనుడి జయంతిలో కుమ్మరి సంఘం నాయకులు


శాలివాహనుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కుమ్మరులు

పాలమూరు, మార్చి 22 : కుమ్మరిజాతి మూలవిరాట్ శాలివాహన చక్రవర్తి అని కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్టు ప్రాంతంలో శాలివాహనుడి జయంతిని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు పూర్వం నుంచి క్రీస్తు శకం ఒకటో శతాబ్దం వరకు 400 ఏళ్ల పాటు శాలివాహనులు పాలించారని అన్నారు. కుమ్మరుల ఆరాధ్యుడు, అఖండ భారతావనిని పరిపాలించిన శాలివాహన చక్రవర్తి విక్రమాదిత్యుడిని ఓడించి రాజ్యాధికారం తీసుకున్నాడ న్నారు. చిన్న చిన్న రాజ్యాలను జయిస్తూ అఖండ భారతావనిని స్వాధీన పరుచుకుని తన పేరుపై శాలివాహన శకంగా ప్రకటించారన్నారు. జిల్లా కేంద్రంలోని శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కుమ్మరులకూ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కుమ్మరి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నవారికి రూ.ఐదువేల పింఛన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య, రవిశేఖర్, రవికుమార్, నాగప్ప, ఆంజనేయులు, అప్పన్నపల్లి బుగ్గన్న, వెంకటయ్య, బాలచందర్, శేఖర్, మాసయ్య, సత్యం, సంఘం సభ్యులు, కులపెద్దలు పాల్గొన్నారు.

కూలి డబ్బులు ఇవ్వాలి

- పనిచేసే చోట ఉపాధి హామీ కూలీల నిరసన


గండీడ్ : జక్లపల్లిలో కూలీలను సముదాయిస్తున్న ఏపీవో హరిచంద్రుడు

గండీడ్, మార్చి 22 : ఏడు వారాల నుంచి కూలి డబ్బులు రావడం లేదని, వెంటనే ఇవ్వాలని శుక్రవారం మండల పరిధిలోని జక్లపల్లి, లింగాయిపల్లి గ్రామాల ఉపాధి హామీ కూలీలు పని ప్రాంతంలో నిరసన చేపట్టారు. జక్లపల్లి 65 మంది కూలీలు, లింగాయిపల్లిలో 45 మంది కూలీలు ప్రధాన రోడ్డుపై నిరసన చేశారు. 15 రోజులకు ఒకసారి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఏపీవో హరిచంద్రుడు అక్కడికి చేరుకొని కూలీలను సముదాయించి తప్పకుండా కూలి డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ఏలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

జడ్చర్లలో...

జడ్చర్ల : ఉపాధి కూలీలకు వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ శుక్రవారం డిమాండ్ చేశారు. గడిచిన వారం రోజులుగా జడ్చర్ల మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించడం జరిగిందని, ఎక్కడా కనీస సౌకర్యాలు, వసతులు కల్పించలేదని ఆరోపించారు. ఉపాధి కూలీలకు కొలతల విధానాన్ని రద్దు చేసి, దినసరి కూలీ రూ.800 చెల్లించాలని కోరారు. నెలరోజులుగా పనిచేస్తున్న కూలీలకు కూలీ డబ్బులు చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. కూలీ డబ్బులు చెల్లించే అంశంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించే అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మండల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించిన వారిలో యాదయ్య, పెంటయ్య, రవికిరణ్, వివేక్, వెంకటమ్మ, మణెమ్మ, జంగయ్య ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ధార భాస్కర్

- నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని విన్నపం


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ధార భాస్కర్

నవాబ్‌పేట, మార్చి 22 : ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధార భాస్కర్ శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా మల్లు రవిని నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తనకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో నామినేటెడ్ పదవుల్లో తప్పక అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 ఎంపీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్/ పాలమూరు, మార్చి 22 : మహబూబ్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ నాయకులు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎస్.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణ ప్రసిడెంట్ ఎం.ఎస్ రవి కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్, యువనేత రాకేష్ వడ్ల, ఇతర నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

25న స్వామివారి కల్యాణం

- నేటి నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

మహబూబ్‌నగర్ రూరల్, మార్చి 22 : మన్యంకొండలో అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 25న సోమవారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు మన్యంకొండ ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీనివాసరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఈ నెల 27 వరకు అమ్మవారి బ్రహోత్సవాలు జరుగుతాయని అన్నారు. శనివారం నుంచి వచ్చే బుధవారం వరకు వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. అమ్మవారి కల్యాణ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

'పూలే-అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలి'

పాలమూరు, మార్చి 22 : పూలె-అంబేడ్కర్ 4వ జాతరను విజయవంతం చేసుకుందామని వ్యవస్థాపక అధ్యక్షుడు బోయపల్లి నరసింహులు, మామిడి సామెల్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మే 27వ తేదీన అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. దానికోసం ఉమ్మడి జిల్లాలోని బహుజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.బాలరాజు, రఘునాథ్, రవికుమార్, జాన్సన్‌బాబు, రమేష్, గువ్వాలక్ష్మణ్, మొగులయ్య, జంగయ్య, విద్యావతి, మాసయ్య, వెంకటయ్య, శ్యామ్, పి.యాదయ్య, రాజు, కృష్ణ, ప్రవీణ్, కేశవులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

గండీడ్, మార్చి 22 : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు అని ఎంపీడీవో దేవన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెన్నాయిపల్లి తండా, గండీడ్ గ్రామాలలో ఆయన పర్యటించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున గోడలకు ఉన్న వివిధ పార్టీల వాల్‌పోస్టర్లను తొలగించాలని గ్రామాల కార్యదర్శులకు సూచించారు. అనంతరం గ్రామాల్లో నర్సరీలను, వాటర్ ట్యాంకును పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో హరిచంద్రుడు, గ్రామ కార్యదర్శి శశికళ పాల్గొన్నారు.


భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో కొత్త ఓటరు కార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కొత్త ఓటరు కార్డుల పంపిణీకి ఏర్పాట్లు


భూత్పూర్, మార్చి 22 : నూతనంగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఎన్నికల కమిషన్ ద్వారా మంజూరైన కొత్త ఓటరు కార్డులను దరఖాస్తు దారులకు తపాలా శాఖ ద్వారా చేరవేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఓటుహక్కు కోసం గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 2500 మందికి ఎన్నికల కమిషన్ ద్వారా నూతన కార్డులు వచ్చాయని తెలిపారు. ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 22 : నేడు సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు సలహాలు ఇవ్వాలని ఆమె కోరారు. వివరాలకు ఫోన్ నెం. 9959226295ను సంప్రదించాలని ఆమె కోరారు.

పింఛన్ ఏమో.. ప్రీమియం డబ్బులైనా వచ్చేనా ?

- వైఎస్ఆర్ అభయహస్తం పథకం లబ్ధిదారుల ఎదురుచూపులు
- డబ్బులు ఇస్తానని చెప్పి ఇవ్వని గత ప్రభుత్వం
- ఈ ప్రభుత్వమైనా ఇవ్వాలని కోరుతున్న లబ్ధిదారులు


వైఎస్ఆర్ అభయహస్తం బాండ్

హన్వాడ, మార్చి 22 : స్వయం సహాయక సంఘాలలో పొదుపు చేసుకుంటూ, 60ఏళ్లు దాటిన మహిళలకు కొంత మొత్తం పింఛన్ ఇచ్చేందుకు వైఎస్ఆర్ అభయహస్తం పథకాన్ని 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. జీవిత బీమారంగ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొన్న ప్రభుత్వం మహిళల నుంచి కొంత ప్రీమియం వసూలు చేసింది. అలా వసూలు చేసిన ప్రీమియం డబ్బులు ఒక్క హన్వాడ మండలంలోనే రూ. కోటికి పైగా అయ్యింది. ఆ డబ్బులైనా తమకు ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

2009 నవంబరు 1న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యుల్లో 60ఏళ్లు పైబడిన వారికి పింఛన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకుగాను వైఎస్ఆర్ అభయహస్తం పింఛన్ పథకం ప్రవేశపెట్టింది. మహిళా సంఘంలో సభ్యు లైన 18 నుంచి 60 సంవత్సరాలు ఉన్న ప్రతీ మహిళ ఈ పథకంలో చేరవచ్చునని ప్రకటించింది. హన్వాడ మండలంలో దాదాపుగా 4610 మంది ఈ పథకంలో చేరి ప్రతీ సంవత్సరం వయస్సు బట్టి రూ.365 నుంచి రూ.3650 వరకు చెల్లించారు. పొదుపుతో పాటు నెల నెలా ఈ పథకం కోసం దాదాపు రూ.75 లక్షల చెల్లించారు. 2014 తర్వాత వచ్చిన తెలంగాణ ప్రభుత్వం ఈ పథకం గురించి పట్టించుకోలేదు. 60 సంవత్సరాలు నిండిన సభ్యులు పింఛన్ ఇప్పించాలని వెలుగు సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయాన్ని పై అధికారులకు వివరించినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. 2018లో రెండవ సారి తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కొంత కదలిక వచ్చింది. వైఎస్ఆర్ అభయహస్తం స్వయం సహాయక బృందం భాగస్వామ్య పింఛన్ పథకం కోసం మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులకు వడ్డీతో కలిసి చెల్లిస్తామని ప్రకటించి పథకంలో చేరిన సభ్యుల వివరాలను సేకరించి వెబ్‌సైట్‌లో పెట్టింది. కొన్ని జిల్లాల్లో కొందరికి చెల్లించి మధ్యలోనే ఆపివేశారు. మండలంలో 4,610 మందికి వడ్డీతో కలిసి దాదాపుగా రూ. కోటీ పది లక్షల రావాల్సిఉందని డీఆర్‌డీవో (వెలుగు) సిబ్బంది అంచనా వేశారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున ఈ పథకంపై కదలిక వచ్చి మా డబ్బులు మాకు ఇస్తారని ఎదురు చూస్తున్నారు. చెల్లించిన డబ్బులైనా ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేస్తాం : ఏపీఎం

ప్రస్తుతం అభయహస్తం స్వయం సహాయక బృందం భాగస్వామ్య పింఛన్ పథకం అమలులో లేదని ఏపీఎం సుదర్శన్ అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో లబ్ధిదారుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. మండలంలో మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులు ఇవ్వాలని మా సిబ్బందిని అడుగుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకొని ఆదేశాలు ఇస్తే వాటిని అమలు చేస్తాం.

మా డబ్బులు మాకు ఇవ్వాలి : లబ్ధిదారు

అభయహస్తం, స్వయం సహాయక సంఘం భాగస్వామ్య పింఛన్ పథకం కోసం చెల్లించిన డబ్బులు తనకు ఇవ్వాలని పథకం సభ్యురాలు చెన్నమ్మ కోరారు. ఇస్తామని అధికారులు చెప్పుతున్నారు కానీ డబ్బులు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. పింఛన్ ఇవ్వకపోయినా డబ్బులైనా ఇవ్వాలని ఆమె కోరారు.